క్లుప్తంగా

విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం

నారాయణఖేడ్: ప్రభుత్వం అవలంభిస్తున్న తప్పుడు విధానాలతో విద్యారంగం దయనీయంగా మారిందని ఏబీవీపీ నగర కార్యదర్శి యశ్వంత్‌రెడ్డి అన్నారు. ఖేడ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పాలకులు విద్యారంగాన్ని విధ్వంసం చేయగా ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే విధానాలను అవలంభిస్తోందని ఆరోపించారు. పేద విద్యార్థులకు సంజీవనిగా మారిన ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ పథకాన్ని నిర్వీర్యం చేయడం దారుణమన్నారు. మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉందని, వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏబీవీపీ నాయకులు శంకర్, విజయ్, విజేశ్, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మండపాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

వట్‌పల్లి(అందోల్): మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో గణేశ్ ఉత్సవాలను పురస్కరించుకొని గణేశ్ విగ్రహాలను ఏర్పాటు చేసేవారు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని ఎస్‌ఐ లక్ష్మణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండప ఏర్పాటుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని సదరు జిరాక్స్ కాపీని పోలీస్‌స్టేషన్‌లో సమర్పించాలని సూచించారు. గణేశ్ విగ్రహాలు ఏర్పాటు చేసిన చోట విద్యుత్ వినియోగం కోసం విద్యుత్ అధికారులను సంప్రదించాలన్నారు. మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతిరోజు ఉత్సవ కమిటీ సభ్యులు ఉండాలన్నారు. విగ్రహాలను నిమజ్జనం చేసే రోజు శాంతియుత వాతావరణంలో విగ్రహాలను తరలించాలని సూచించారు.

రాయిపల్లి రూట్‌లో బస్సుల రద్దు

జహీరాబాద్‌టౌన్: జహీరాబాద్ నుంచి రాయిపల్లి వైపు వెళ్లే బస్సు సర్వీసులను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు డీఎం హుస్సేన్ తెలిపారు. జహీరాబాద్ డిపో నుంచి రాయిపల్లి రూట్‌లో మెదక్, నిజామాబాద్, నారాయణఖేడ్ బస్సులు ప్రతీ రోజు నడుస్తున్నాయన్నారు. భారీ వర్షాలతో రాయిపల్లి సమీపంలో గల మంజీర బ్రిడ్జికి రెండువైపులా రోడ్డు దెబ్బతిందన్నారు. దీంతో ఈ రూట్ గుండా నడిచే బస్సులను తాత్కాలికంగా రద్దు చేసి నిజామాబాద్ సర్వీస్‌ను న్యాల్‌కల్ మీదుగా నడుపుతున్నట్లు డీఎం పేర్కొన్నారు.

గణేశ్ మండపం ఏర్పాటుకు కర్రపూజ

నారాయణఖేడ్: పట్టణంలోని ఏఎస్‌నగర్‌లో భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న గణేశ్ మండపం ఏర్పాటుకు మంగళవారం కర్రపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా భజరంగ్‌దళ్ నాయకులు మాట్లాడుతూ.. పట్టణంలో గత 16సంవత్సరాలుగా భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నామని, ఈ సంవత్సరం కూడా వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ రజినీకాంత్, నాయకులు సాయిరాం, ప్రవీణ్‌గౌడ్, బంటు అశోక్, రాజశేఖర్ గౌడ్, వీరారెడ్డి, అశోక్‌యాదవ్, వంశీ, కృష్ణారెడ్డి, సాయిచరణ్ ఉన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెల్లాపూర్ జిల్లా పరిషత్ పాఠశాల హెచ్‌ఎం భాస్కర్ అన్నారు. మంగళవారం పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలసి ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మొక్కలు నాటాలని సూచించారు. మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమవుతుందని తెలిపారు.

మైక్‌సెట్ దుకాణ యజమానుల బైండోవర్

జహీరాబాద్: మైక్‌సెట్ దుకాణ యజమానులను పోలీసులు మంగళవారం తహసీల్దార్ రవీందర్ ఎదుట బైండోవర్ చేశారు. వినాయక చవితిని పురస్కరించుకొని మాములు మైకులను మాత్రమే వాడాలని, డీజేలను ఉపయోగించొద్దని దుకాణ యజమానులకు తహసీల్దార్ సూచించారు. డీజేలను ఏర్పాటు చేసినట్లయితే తగిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు.

జిమ్ సామగ్రి పేరుతో రూ.2 లక్షలు మోసం

పటాన్‌చెరు టౌన్: ఆన్‌లైన్‌లో జిమ్ సామగ్రి పేరుతో ఓ నిర్వాహకుడి నుంచి సైబర్ నేరగాళ్లు భారీ ఎత్తున నగదు కాజేశారు. పోలీసు కథనం మేరకు.. అమీన్‌పూర్ పరిధిలోని ఓ కాలనీకి చెందిన జిమ్ నిర్వాకుడుకి ఆగస్టు 17వ తేదీన ఆన్‌లైన్‌లో జిమ్ సామగ్రి విక్రయానికి ఉందని పోస్టు వచ్చింది. దీనికి స్పందించిన నిర్వాహకుడు ఆన్‌లైన్ ద్వారా మూడు దఫాలుగా రూ.2లక్షలు చెల్లించాడు. తీరా అపరిచితవ్యక్తి బాధితుడి అడ్రస్‌కు జిమ్ సామగ్రి స్థానంలో కేబుల్‌వైర్లు పంపాడు. తాను మోసపోయినట్లు గుర్తించి మంగళవారం అమీన్‌పూర్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

నో వర్కింగ్ రిపేర్

- దిష్టిబొమ్మల్లా సీసీకెమెరాలు
- రెండేళ్లుగా ఇదే పరిస్థితి
- పట్టించుకోని పోలీసులు
- జోగిపేటలో జోరుగా దొంగతనాలు

జోగిపేట(అందోల్): జోగిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న సీసీ కెమెరాలు పనిచేయక, నిర్వహణలేక, రిపేర్లు చేయకపోవడంతో కరెంట్ స్తంభాలకు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. దీంతో దొంగతనాలు విచ్చలవిడిగా జరుగుతున్నా నిందితులను గుర్తించడంలో పోలీసులకు చాలా ఇబ్బందికరంగా మారింది. రెండేళ్లుగా పట్టణంలోని 70 సీసీ కెమెరాల్లో కనీసం పట్టుమని పది కూడా పనిచేసే పరిస్థితి లేకుండా పోయింది. వీటి నిర్వహణలో పోలీసుల నిర్లక్ష్యం కారణంగా చాలా మంది బాధితులు ఆర్థికంగా నష్టపోయిన సంఘటనలు కూడా ఉన్నాయి. రోడ్డు యాక్సిడెంట్ కేసుల్లో కూడా సీసీకెమెరాలు ఉన్నా అవి పనిచేయని కారణంగా గుర్తు తెలియని వాహనాలను గుర్తించని సంఘటనలు అనేకంగా ఉన్నాయి.


జోగిపేటలో పనిచేయని సీసీ కెమెరా

ప్రధాన కూడళ్లలో..

పట్టణంలోని ప్రధాన కూడళ్లయిన బసవేశ్వర విగ్రహం, ఆర్టీసీ బస్టాండ్ పోలీస్‌స్టేషన్ చౌరస్తా, హనుమాన్ చౌరస్తా, అంబేడ్కర్ చౌరస్తా, క్లాక్‌టవర్‌తో పాటు ప్రధాన చౌరస్తాలలో నాలుగేళ్ల క్రితం వ్యాపారస్తులు, ప్రజాప్రతినిధులు ఇచ్చిన విరాళాలతో అప్పటి ఎస్‌ఐ వెంకటరాజాగౌడ్ 70 వరకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఆయన బదిలీ అయిన తర్వాత రిపేర్ల గురించి పట్టించుకోలేదు. దీంతో అవి దిష్టిబొమ్మల్లా మారాయి. పట్టపగలు పట్టణంలో దొంగతనాలు జరిగినా నిందితులను గుర్తుపట్టలేని పరిస్థితి.పట్టణంలో యాక్సిడెంట్‌లు జరిగి ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు కూడా ఉన్నాయి. కానీ గుర్తుతెలియని వాహనాలను గుర్తించే అవకాశం లేక ఆ కేసుల్లో పురోగతి సాధించలేకపోయారు.

పోలీస్‌స్టేషన్ ముందే..

ఇటీవల స్థానిక పోలీస్‌స్టేషన్ ముందే విద్యుత్ శాఖలో ఏడీగా పనిచేసి రిటైర్ అయిన రవీందర్‌రెడ్డి బ్యాంకులో నుంచి రూ.10లక్షల రూపాయలను డ్రా చేసుకొని వచ్చి తన కారు ముందు సీటుపై పెట్టి కారును పోలీసు గేట్ ఎదుట నిలిపి అవతలి రోడ్డులోని స్వీట్ హౌస్‌కు వెళ్లి స్వీట్‌ను తీసుకొని తిరిగి వచ్చేసరికి గుర్తుతెలియని వ్యక్తులు కారు అద్దాలు పగలగొట్టి పది లక్షలు అపహరించుకుపోయారు. వారిని గుర్తించేందుకు ఆ ప్రాంతంలో సీసీ కెమెరాలు లేకపోవడంతో సంఘటన జరిగి ఐదురోజులు కావొస్తున్నా ఇప్పటివరకు క్లారిటీ లేదు. నిందితులను పట్టుకునేందుకు పోలీసులకు కూడా ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

విరాళాల కోసం పోలీసుల ప్రయత్నాలు

పట్టణంలో పాడైన సీసీ కెమెరాలను రిపేర్ చేయడానికి సుమారుగా రూ.2లక్షల వరకు ఖర్చు అవుతుందని మెకానిక్‌లు తెలపడంతో ఆ డబ్బులను ఎలా సమకూర్చాలన్న విషయమై ఎస్‌ఐ, సీఐలు ప్రయత్నాలు ప్రారంభించారు. స్థానికంగా వ్యాపారస్తులు, ప్రజాప్రతినిధుల వద్ద నుంచి విరాళాల సేకరించి పనిచేయని సీసీ కెమెరాలను రిపేర్ చేయించాలని యోచిస్తున్నారు. అయితే మూడు నాలుగేళ్ల కిందటే తామిచ్చిన డబ్బులతోనే సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారని వ్యాపారస్తులు చెబుతున్నట్లు తెలిసింది.

పోలీసులపై విమర్శలు

స్థానికంగా జరుగుతున్న సంఘటనల్లో నిందితులను గుర్తించడంలో జరుగుతున్న అలసత్వంపై పోలీసులపై విమర్శలు వస్తున్నాయి. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రతీ రోజు సెల్‌ఫోన్‌ల దొంగతనాలు జరుగుతున్నాయి. దీనిపై బాధితులు మీసేవల్లో ఫిర్యాదులు చేసుకుంటున్నారు. సంత రోజున కూడా దొంగతనాలు జరుగుతూనే ఉన్నాయి. పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలోని దుకాణాల్లో కూడా దొంగతనాలు జరిగిన సంఘటనలు కూడా ఉన్నాయి. ఆ సంఘటనల్లో ఇప్పటివరకు నిందితులను గుర్తించలేకపోయారు.


సీసీ కెమెరాలు పరిశీలించే డిస్‌ప్లే

మరమ్మతు చేయిస్తాం

పట్టణంలో మొత్తం 70 వరకు సీసీ కెమెరాలు ఇదివరకే ఏర్పాటు చేసి ఉన్నాయి. అందులో చాలావరకు పనిచేయకపోవడంతో కొన్ని ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. స్థానికుల సహకారంతో అన్ని కెమెరాలు పనిచేసేలా మరమ్మతులు చేయిస్తాం. సీసీ కెమెరాల మరమ్మతులకు స్థానిక వ్యాపారస్తులు సహకరించాలి. ప్రధాన కూడళ్లలో తొందరలోనే సీసీకెమెరాలను పునఃరుద్ధరిస్తాం. రవీందర్‌రెడ్డి కేసును కూడా ఛేదించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం.

– అనిల్‌కుమార్, సీఐ జోగిపేట

తెగిన రోడ్డు.. ఆగిన రాకపోకలు

రాయికోడ్(అందోల్): మండలంలోని సిరూర్ సమీపంలో నిర్మాణంలో ఉన్న రోడ్డు తెగిపోవడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. అల్లాదుర్గం–మెటల్‌కుంట రోడ్డు మార్గంలో డబుల్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టగా మధ్యలోనే నిలిచిపోయాయి. సిరూర్ సమీపంలో రోడ్డుకిరువైపులా మంజీరా నది నీరు ఉంటుంది. రోడ్డు నిర్మాణంలో భాగంగా వేసిన కంకర, మట్టి గతంలోనే పాక్షికంగా కుంగిపోయింది. దీంతో రోడ్డు దెబ్బతిన్న ప్రాంతంలో ఒకే వాహనం వెళ్లేలా తాత్కాలిక రాకపోకలను కొనసాగించారు. తాజాగా తుఫాను ప్రభావంతో కురిసిన వర్షాల కారణంగా రోడ్డు మరింత తెగిపోవడంతో రాకపోకలను నిలిపివేశారు. జహీరాబాద్ నుంచి నిజామాబాద్, మెదక్ పట్టణాలకు నిత్యం నడిచే ఆర్టీసీ సర్వీసులను న్యాల్‌కల్ గుండా దారి మళ్లించారు. యుద్ధప్రాతిపదికన రోడ్డుకు మరమ్మతులు చేపట్టి రాకపోకలను పునఃరుద్ధరించాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.


సిరూర్ సమీపంలో తెగిపోయిన రోడ్డు

గీతంలో రీసెర్చ్ స్పేస్ ప్రారంభం

పటాన్‌చెరు: గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ(జీఎస్‌టీ)లోని ఇంజినీరింగ్ విభాగాల మధ్య ఆవిష్కరణలు, సహకారాన్ని పెంపొందించడానికి నెలకొల్పిన రీసెర్చ్ స్పేస్‌ను జాతీయ ఖనిజాభివృద్ధి సంస్థ (ఎన్‌ఎండీసీ)జనరల్ మేనేజర్ (పరిశోధన–అభివృద్ధి)ఎస్.కె.చౌరాసియా మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. ఇది మెకానికల్ ఇంజినీరింగ్, సివిల్, ఈఈసీఈ, సీఎస్‌ఈ విభాగాలకు ఉమ్మడి కేంద్రంగా పనిచేస్తోందని, ఆవిష్కరణ, పరిశోధనా నైపుణ్యాన్ని పెంచడానికి ఉపకరిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. సాంకేతికను అందిపుచ్చుకొని మంచి ఆవిష్కరణలు చేయడానికి దీనిని సద్వినియోగం చేసుకోవాలని అధ్యాపకులు, పరిశోధన విద్యార్థులకు చౌరాసియా సూచించారు. ఈ అధునాతన రీసెర్చ్ స్పేస్‌లో 20 అత్యాధునిక కంప్యూటర్లను నెలకొల్పామని, ఒక్కొక్కటీ 13వ తరం ఇంటెల్ కోర్ ఐ7 ప్రాసెసర్లతో 4.5 గిగాహెడ్జ్ సామర్థ్యం, 8 జీబీ రామ్ పనిచేస్తాయని, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరక్టర్ కోర్ ఇంజినీరింగ్ డీన్ ప్రొఫెసర్ రామశాస్త్రి వివరించారు. వినూత్న పరిశోధన, ఆచరణాత్మక అభ్యాసం ద్వారా ఇంజినీరింగ్ జ్ఞానం, నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి ఈ రీసెర్చ్ స్పేస్‌ను అంకితం చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ ప్రారంభోత్సవంలో పలు విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కర్ణాటక రహదారి మూసివేత

జహీరాబాద్: జహీరాబాద్ నుంచి బూచనెల్లి గ్రామం మీదుగా కర్ణాటకలోని మన్నెల్లి గ్రామానికి వెళ్లే రహదారిని వరద కారణంగా మూసివేశారు. మంగళవారం బూచనెల్లివద్ద వరద పరిస్థితిని తహసీల్దార్ పరిశీలించారు. మూసివేసిన రహదారి ప్రాంతాన్ని సందర్శించారు. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా నారింజ ప్రాజెక్టులోకి భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ఇన్‌ఫ్లో 4వేల క్యూసెక్కుల మేర ఉంది. ప్రాజెక్టులోని ఒక గేటును పైకెత్తి నీటిని దిగువకు వదిలిపెడుతుండడంతో వరదనీరు బూచనెల్లి వద్ద కర్ణాటక వెళ్లే రహదారిపై నుంచి ప్రవహిస్తోంది. దీంతో రోడ్డును పూర్తిగా మూసివేసి రాకపోకలను నిలిపివేశారు. గతంలో వరదల్లో ఓ రైతు కొట్టుకుపోయి మృత్యువాత పడ్డాడు. ప్రాణనష్టం జరగకుండా ఉండేందుకుగాను అధికారులు చర్యలు చేపట్టారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఎడతెరిపిలేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా కార్పొరేటర్ పుష్పనగేశ్ ఉండాలని సూచించారు. పాత రామచంద్రాపురంలో బీసీ బాలికల హాస్టల్ వద్ద రోడ్డుపై వరదనీరు చేరడంతో ఆ ప్రాంతాన్ని మంగళవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. వర్షాల కారణంగా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.


పలు కాలనీల్లో పర్యటిస్తున్న కార్పొరేటర్ పుష్ప

కేఎస్ఆర్ కాలనీ అభివృద్ధికి కృషి

పటాన్‌చెరుటౌన్: కేఎస్ఆర్ కాలనీ అభివృద్ధి, సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళ్లనున్నట్లు కాలనీ నూతన అధ్యక్షుడు భాస్కర్ పేర్కొన్నారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని కేఎస్ఆర్ కాలనీ హౌస్ ఓనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని అడ్వకేట్ డాక్టర్ పాండురంగారావు ఆధ్వర్యంలో మంగళవారం ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా మల్లికార్జున్‌రావు, సంయుక్త కార్యదర్శిగా రూపక్ బైద్య, కోశాధికారిగా యన్మన్‌గండ్ల ఆదిత్య ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు భాస్కర్ మాట్లాడుతూ.. కాలనీ అభివృద్ధే ధ్యేయంగా అసోసియేషన్ ముందుకు వెళ్తుందని పేర్కొన్నారు. కాలనీవాసులు పాల్గొన్నారు.

పొలాల్లో నీరు నిల్వకుండా చూసుకోవాలి

జహీరాబాద్ టౌన్: భారీ వర్షాలు కురుస్తున్నందున పంట పొలాల్లో వర్షం నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని జహీరాబాద్ ఏడీఏ భిక్షపతి సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంట పొలంలో నీరు అధికంగా ఉంటే ఎక్కువ రోజులు నిల్వ ఉంచకుండా వెంటనే దిగువ ప్రాంతానికి తరలించాలన్నారు. నీరు పారకుండా ఒకే చోట ఉంటే పంటలు దెబ్బతింటాయని చెప్పారు. వర్షాలు తగ్గేవరకు పంట పొలాల్లో మందులను పిచికారీ చేయొద్దన్నారు. రైతులు విద్యుత్ స్తంభాలు, తీగలు, చెరువులు, నీటి కుంటలకు దూరంగా ఉండాలన్నారు. టమాటా పంటకు స్టికింగ్ చేయాలని, అలా చేయడంతో మొక్కలు దెబ్బతినకుండా పంట నాణ్యత బాగుటుందన్నారు. వరి చేనులో గట్లను శుభ్రం చేసుకోవాలని, దీంతో కాండం తొలుచు పురుగులు, అగ్గి తెగుళ్లు ఆశించవని తెలిపారు.

ఉద్యమకారుడికి సన్మానం

జహీరాబాద్‌టౌన్: పట్టణానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, మాజీ కౌన్సిలర్ రాములును కరీంనగర్ సారస్వత జ్యోతి మిత్ర మండలి నిర్వాహకులు సన్మానించారు. స్వాతంత్ర్య సమరయోధుడు, విశ్వబంధు డాక్టర్ బోయినపల్లి వెంకటరామారావు(బొవేరా) జయంతి సందర్భంగా కరీంనగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జ్ఞాపిక, శాలువాతో సత్కరించారు. తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నందుకుగాను నిర్వాహకులు రాములును బొవేరా పురస్కారం అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సారస్వత జ్యోతి మిత్ర మండలి నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

జాబ్ మేళాకు అనూహ్య స్పందన


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రత్నప్రసాద్

సంగారెడ్డి ఎడ్యుకేషన్: సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన జాబ్‌మేళాకు అనూహ్య స్పందన వచ్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కెఎస్ రత్నప్రసాద్ తెలిపారు. తారా ప్రభుత్వ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగాలు, ఈడీసీ, ప్లేస్‌మెంట్‌సెల్ ఆధ్వర్యంలో ఎంఆర్ఎఫ్ పరిశ్రమ సహకారంతో మంగళవారం జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ఈ జాబ్ మేళాలో 108 మంది పాల్గొనగా వందమందికి ప్లేస్‌మెంట్ లభించిందని, ఈ ప్లేస్‌మెంట్ 100% జరగడం కళాశాలలో మొదటిసారి అని తెలిపారు. భవిష్యత్‌లో ఇటువంటి జాబ్‌మేళాలు నిర్వహించి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలను కల్పించడానికి కళాశాల ఎప్పుడూ ముందు ఉంటుందన్నారు. ఈ జాబ్‌మేళాలో ఎంఆర్ఎఫ్ యాజమాన్యం తరఫున హెచ్ఆర్ మేనేజర్లు రఘురాం, రమేశ్‌కుమార్, ప్రొడక్షన్ ఇన్‌చార్జి అజయ్, ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ సదయ్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు చేయూత

నారాయణఖేడ్: వర్షాలతో పట్టణంలో కూలిన ఇళ్లను ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి మంగళవారం సాయంత్రం పరిశీలించి బాధితులను పరామర్శించారు. మంగల్‌పేట్‌లో ఇళ్లు కూలిన బాధితులను పరామర్శించి తక్షణ సహాయం కింద నిత్యావసర సరుకులను అందించారు. డివిజన్‌లో జరిగిన నష్టాన్ని అధికారులు అంచనా వేసి బాధితులకు తగు సాయం అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్‌షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్, కమిషనర్ జగ్జీవన్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు వినోద్‌పాటిల్, కౌన్సిలర్లు కవిత, హన్మాండ్లు, నాయకులు పాల్గొన్నారు. సీతారాం తండాలో కూలిన ఇళ్లను పరిశీలించిన ఎస్ఆర్ఐ గుర్రపు మచ్చేందర్ బాధితులకు ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు లక్ష్మీబాయి, నాయకులు ప్రభాకర్, కిష్టారెడ్డి, రాజు, గంగారాం ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి పలు గ్రామాల్లో కూలిన ఇళ్లను పరిశీలించి బాధితులను పరామర్శించారు.


మంగల్‌పేట్‌లో బాధితులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఎమ్మెల్యే

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

నారాయణఖేడ్: పట్టణంలోని కల్పనా హనుమాన్ ఆలయంలో శ్రావణమాసం పురస్కరించుకొని మంగళవారం నిర్వహించిన నవనాథ పారాయణ పురాణ పఠణం, పూర్ణాహుతి కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి, అనుపమారెడ్డి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతర్గాం పీఠాధిపతి కరణ్ గజేంద్రభారతి మహారాజ్ నవనాథపురాణ పఠనం విశేషాలను వివరించారు. కార్యక్రమాల్లో డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు జిల్లా సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని నెహ్రూనగర్ హనుమాన్ ఆలయంలో ఎస్ఆర్ఐ గుర్రపు మచ్చేందర్ పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. దత్తాత్రేయ ఆలయంలో ఉమాపార్థీవ లింగార్చన, సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. జహీరాబాద్ ఎంపీ సురేశ్‌షెట్కార్ సతీమణి ఉమాదేవి షెట్కార్, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు సంగీత షెట్కార్, ఆలయ కమిటీ బాధ్యులు శివలింగ్‌పటేల్, వివేకానంద్, ముత్యంపు హన్మాండ్లు పాల్గొన్నారు.


ఖేడ్ హనుమాన్ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే దంపతులు

వదలని వాన

- అలుగు పారుతున్న చెరువులు, కుంటలు
- పలుచోట్ల కూలిన ఇళ్లు
- పంట చేలల్లో భారీగా చేరిన వరదనీరు

జిల్లాలో మూడు, నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువులు, కుంటలు నిండుకుండలా మారాయి. పలు గ్రామాల్లో చెరువులు అలుగు పారుతున్నాయి. పలు చోట్ల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో వరద నీరు పంట చేలల్లో భారీగా వచ్చి చేరింది. వరదనీటిని తీసేయడానికి రైతులు నానాతంటాలు పడుతున్నారు. నల్లవాగు ప్రాజెక్టును మంగళవారం ఎమ్మెల్యే సంజీవరెడ్డి పరిశీలించారు. ముసురు వానలకు గ్రామాల్లో ఇళ్లు కూలిపోయాయి. ఆయా గ్రామాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు పర్యటించి బాధితులను పరామర్శించి సాయం అందజేస్తున్నారు. చెరువులు, కుంటల వద్ద అధికారులు, గ్రామస్తులు గంగమ్మకు ప్రత్యేక పూజలు చేస్తున్నారు.



వట్‌పల్లి(అందోల్): అలుగు పారుతున్న కేరూర్ ఊరకుంట చెరువు


నారాయణఖేడ్: అలుగు పారుతున్న గంగాపూర్ చెరువు


జహీరాబాద్: అలుగు పారుతున్న పెద్దవాగు


కల్హేర్: నల్లవాగు పరవళ్లు


కల్హేర్: మహదేవుపల్లిలో కూలిన ఇల్లు


నారాయణఖేడ్ బాచేపల్లిలో వరి చేలల్లో నిలిచిన వరద


వట్‌పల్లి(అందోల్): మర్వెల్లిలో పత్తి పంటలో నిలిచిన నీటిని తీసేస్తున్న రైతు


నారాయణఖేడ్: కూలిన ఇల్లు